W W W.EPAPER.MAHADAILY.COM

మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

12-1-2026



## రాష్ట్రంలో నివాసయోగ్య నగరంగా ఖమ్మం

రాష్ట్రంలో నివాస యోగ్య నగరంగా ఖమ్మం ముందు వరుసలో ఉందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.మంత్రి తుమ్మల ఆదివారం ఖమ్మం నగరం 54వ డివిజన్ లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ పార్క్ ను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ప్రారంభోత్సవం చేశారు.



# సత్తుపల్లిలో భారీ సైబర్ దోపిడీ

04

- 18మంది నిందితుల అరెస్ట్
- రూ.547 కోట్ల ఘరానా మోసం
- అంతర్జాతీయ సైబర్ నేరాల ముఠా గుట్టురట్టు

ఖమ్మం జిల్లా సత్తుపల్లి కేంద్రంగా సాగుతున్న భారీ అంతరాజతీయ సైబర్ నేరాల ముఠాను పోలీసులు గుట్టురట్టు చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన పేరుతో వల విసిరి, సుమారు 547 కోట్ల రూపాయల మేర మోసాలకు పాల్పడిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదివారం పెనుబల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు.

సత్తుపల్లి, మహా



02

## క్రీడా ప్రాంగణం కబ్జా

అది ఓ ఏజెన్సీ ప్రాంతం అందులో ప్రభుత్వ భూమి రెవిన్యూ శాఖ గ్రామపంచాయతీకి అప్పగించగా గ్రామపంచాయతీ లక్షల రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించిన క్రీడామైదానంలో ఏజెన్సీ చట్టాలు ప్రభుత్వ భూమి, గ్రామపంచాయతీ నిర్మించిన క్రీడా మైదానం ఇవేమీ పట్టని ఓగిరిజనేతరుడు దర్జాగా ఆ ప్రభుత్వ, గ్రామపంచాయతీ క్రీడా మైదానం నిర్మించిన ఎకరం భూమిని దర్జాగా కబ్జా చేసి, అంతటితో ఆగక ఆ ఎకరం భూమిలో ఏకంగా వరి పొలమే పండించాడు.



09

## జాతీయ బాలుర కబడ్డీ పోటీల్లో రాజస్థాన్ ఘన విజయం

పారశాల క్రీడా సమాఖ్య (కేజీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన 69వ అండర్--17 జాతీయ బాలుర కబడ్డీ పోటీ లు ఘనంగా ముగిశాయి. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిభావం తమైన కబడ్డీ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు.



08

## చివరి రోజు గందరగోళం

69వ జాతీయ అండర్--17 కబడ్డీ పోటీల్లో ఆదివారం గందరగోళం చోటు చేసుకుంది. తెలంగాణ జట్టుపై యూపీ జట్టు గెలుపొం దడంతో ప్రారంభమైన వివాదం ఆదివారం రాత్రి వరకు కొనసాగింది. ఉత్తరప్రదేశ్ టీమ్ నిబంధనలకు విరుద్ధంగా అధిక వయసు గల యువకులతో కబడ్డీ ఆట ఆడించిందని తెలంగాణ టీమ్‌కు సంబంధించిన అధికారులు ఎన్‌టీఎఫ్ ఫిర్యాదు చేశారు.

# క్రీడా ప్రాంగణం కబ్జా

## దర్జాగా వరి నాటు వేసిన గిరిజనేతరుడు

**జిపిఓ నుండి కలెక్టర్ దాకా అంతా ఆ మార్గంలోనే పయనం అయినా ఆ కబ్జాను గుర్తుపట్టని వైనం**

**అధికారుల నిర్లక్ష్యం లక్ష రూపాయల ప్రజాధనం వృధా**

### కబ్జా చేసిన గిరిజనేతురిడిపై ఎల్‌టిఆర్ కేసు నమోదు చేయాలని స్థానికులు డిమాండ్

**మహా దుమ్ముగూడెం:** అది ఓ ఏజెన్సీ ప్రాంతం అందులో ప్రభుత్వ భూమి రెవిన్యూ శాఖ గ్రామపంచాయతీకి అప్పగించగా గ్రామపంచాయతీ లక్షల రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించిన క్రీడామైదానంలో ఏజెన్సీ చట్టాలు ప్రభుత్వ భూమి, గ్రామపంచాయతీ నిర్మించిన క్రీడా మైదానం ఇవేమీ పట్టని ఓగిరిజనేతరుడు దర్జాగా ఆ ప్రభుత్వ, గ్రామపంచాయతీ క్రీడా మైదానం నిర్మించిన ఎకరం భూమిని దర్జాగా కబ్జా చేసి, అంతటితో ఆగక ఆ ఎకరం భూమిలో ఏకంగా వరి పొలమే పండించాడు. ప్రభుత్వ గ్రామపంచాయతీ క్రీడా మైదానం కబ్జా సంబంధించిన వ్యవహారం వివరాల్లోకి వెళితే..గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీలో క్రీడా మైదానం,పల్లె ప్రకృతి వనం, పార్కు, వైకుంఠధామం, డంపింగ్ యార్డ్ ఇలాంటి మౌలిక వసతులు కల్పించాలని లక్ష్యంతో గ్రామ పంచాయతీలకు అప్పట్లో నిధులు కేటాయించింది. అందులో భాగంగానే ప్రగళ్ళ పల్లి గ్రామపంచాయతీకి కూడా ఈ మౌలిక వసతులు కల్పించడం కోసం నిధులు కేటాయించగా భైరగులపాడు గ్రామ శివారు సున్నం బట్టి గ్రామానికి వెళ్లి రహదారికి ఆనుకుని ఉన్న సర్వేనెంబర్ 2/1 లో ఒక ఎకరం విస్తీర్ణం గల ప్రభుత్వ భూమిని ప్రగలపల్లి గ్రామపంచాయతీకి క్రీడా మైదానం నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దుమ్ముగూడెం మండల రెవెన్యూ అధికారులు కేటాయించారు. దీంతో మౌలిక మౌలిక వసతులు కల్పనలో భాగంగా గ్రామపంచాయతీ అప్పటి సర్పంచ్, పాలకమండలి గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రభుత్వం కేటాయించిన ఈ భూమిలో క్రీడా మైదానం నిర్మాణం చేపట్టారు. ఈ క్రీడ మైదానాన్ని గ్రావెల్ తో చదును చేసి యువకులు క్రీడాకారులు వ్యాయామం చేసుకోవడానికి వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయడంతో పాటు పలు క్రీడా పరికరాలు సమకూర్చారు. క్రీడా మైదానానికి భారీ ఇనుప గేటు, క్రీడా మైదానాన్ని సూచించే క్రీడా మైదానం బోర్డు తదితర ఏర్పాట్లకు గాను లక్ష రూపాయలు ప్రజాధనాన్ని వినియోగించారు. ఇక్కడ వరకు అంతా బాగున్నా ఈ క్రీడా మైదానం పని పూర్తయ్యాకే అసలు కథ మొదలైంది. ఓ ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ భూమిని గిరిజనేతరులు కబ్జా చేయడం ఆక్రమించుకోవడం ఏజెన్సీ చట్టాల ప్రకారం పెద్ద నేరం అందులో గ్రామ పంచాయతీకి కేటాయించిన మొక్కలు నాటి క్రీడా మైదానం గా లక్షల రూపాయల ఖర్చు పెట్టి పరికరాలు ఏర్పాటుచేసిన క్రీడా మైదానాన్ని ఓ గిరిజనేతరుడు కబ్జా చేసి స్వాధీన పరచుకోవడం మరి పెద్ద నేరం కానీ బైరాగులుపాడు క్రీడా మైదానాన్ని ఆక్రమించుకున్న బైరాగులపాడు గ్రామానికి చెందిన గిరిజనేతరుడికి మాత్రం ఈ ఏజెన్సీ చట్టాలు ప్రభుత్వ స్థలాలు ఆక్రమించడం నేరం అని అనిపించలేదు అనుకుంటా బైరాగులపాడు గ్రామంలో గ్రామపంచాయతీ నిర్మించిన ఆ ఎకరం విస్తీర్ణంగాల క్రీడా మైదానాన్ని ఆక్రమించడమే కాకుండా ఏకంగా అందులో వరి పొలమే వేశాడు. ఇటీవలే దర్జాగా అందులో పడిన వరి పంటను కూడా తీసుకున్నాడు. కబ్జాకు ఏది అనర్హం కాదు అని నానుడిని నిజం చేశాడు ఆ గిరిజనేతరుడు. ఇంత జరుగుతున్న అప్పటి పాలకమండలి గాని, ఆ పంచాయతీ కార్యదర్శి గాని, పంచాయతీరాజ్ రెవెన్యూ అధికారులు గానీ గత కొంత కాలంగా ఈ తతంగాన్ని కంటితో చూస్తూనే ఉన్నారు గాని ప్రభుత్వ భూమి అందులో గ్రామపంచాయతీ క్రీడా మైదానం నిర్మించిన భూమిని కబ్జా చేయడం నేరమని ఏజెన్సీ చట్టాల ఉల్లంఘన కిందకి వస్తుందని అలా చేస్తే తనపై ఎల్ టి ఆర్ కేసు నమోదు అవుతుందని ఆ కబ్జాదారుడికి చెప్పిన పాపాన పోలేదు. ఇంకా ఆ కబ్జాదారుడికి అడ్డు అదుపు ఏముంది ఇప్పుడు మళ్లీ అదే క్రీడా మైదానంలో మరొక పంట వేయడానికి కూడా వ్యవసాయ పనులు మొదలుపెట్టాడు ఆ కబ్జాదారుడు. ఈ కబ్జా వ్యవహారంలో మరో విచిత్రమైన విషయం ఏంటంటే ఇదే గ్రామానికి చెందిన కనీసం సొంత భూమి కూడా లేని ఒక గిరిజనేతరుడు వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనపరచుకున్న రెవెన్యూ గ్రామపంచాయతీ అధికారులు పది ఎకరములు పైనే పట్టా భూమి కలిగిన ప్రస్తుత క్రీడా మైదానం కబ్జా చేసిన ఈ గిరిజనేతరుడు వద్ద ఉన్న ఈ భూమిని మాత్రం రెవెన్యూ గ్రామపంచాయతీ అధికారులు స్వాధీ పరుచుకోకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఏ గ్రామంలోనైనా ఓ వ్యక్తికి చెందిన భూమీ, లేక ప్రభుత్వానికి చెందిన భూమి కొందరి వ్యక్తుల చేత దౌర్జన్యానికి లేక కబ్జాకి గురి అవుతాయి గ్రామపంచాయతీ సర్పంచ్ కు గ్రామపంచాయతీ అధికారులకు తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకుంటారు. కానీ ఇక్కడ ఏకంగా ఆ గ్రామపంచాయతీకే అన్యాయం జరిగింది. మరి ఈ గ్రామపంచాయతీ తమకు జరిగిన అన్యాయాన్ని ఎవరికి చెబుతుందో వేచి చూడాలి మరి.

### జిపిఓ నుండి కలెక్టర్ దాకా అంతా ఆ మార్గంలోనే పయనం అయినా ఆ కబ్జాను గుర్తుపట్టని వైనం

ప్రతి ఏటా గోదావరి వరదలకు బైరాగులపాడు గ్రామానికి పక్కనే నుండి గోదావరిని అనుకోని ఉన్న సున్నం బట్టి గ్రామం ప్రతి యేటా వరద ముంపుకు గురి అవుతుంది. ఆ సమయంలో సుమారు జూలై నుండి సెప్టెంబర్ వరకు వరద ప్రభావం ఆ గ్రామ మీద ఉంటుంది. ఆ పరిస్థితులలో గోదావరి వరద పెరిగినప్పుడల్లా జిపిఓ ని మొదలుకొని ఆర్ ఐ, తహసిల్దార్, ఎండిఓ, ఎంపిఓ, ఆర్డిఓ, ఐటిడిఏ పిఓ, కలెక్టర్ వరకు, మంత్రుల వరకు అందరూ ఈ కబ్జాకు గురైన క్రీడా మైదానాన్ని దాటే ముంపుకు గురవుతున్న సున్నం బట్టి గ్రామానికి వెళ్లి వస్తుంటారు. కానీ ఏనాడైనా ఏ అధికారైనా ఇక్కడ క్రీడా మైదానం బోర్డు ఉంది కానీ ఆ మైదానంలో వరి పొలం ఎందుకు ఉంది అని మాత్రం అనుమానించి పరీక్షించి చూసిన పరిస్థితి రాకపోవడం బాధాకరమని స్థానికులు వాపోతున్నారు. ఏజెన్సీ చట్టాలను ప్రభుత్వ ఆస్తులను కాపాడవలసిన అధికారులే మౌనం వహిస్తే సామాన్య ప్రజలకు ప్రభుత్వం మీద అధికారుల మీద వున్న కాస్త నమ్మకం పోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




### క్రీడా మైదానం కబ్జా గ్రామ పంచాయతీ కార్యదర్శిని వివరణ

సర్వేనెంబర్ 2/1 లో ఎకరం విస్తీర్ణం గల ప్రభుత్వ భూమిని గ్రామపంచాయతీకి కేటాయించింది వాస్తవమేనని అందులో లక్ష రూపాయలు ఖర్చు చేసి క్రీడా మైదానం నిర్మించింది కూడా వాస్తవమేనని ఆమె తెలిపారు. గ్రామానికి చెందిన ఓ గిరిజనేతరుడు ఆ భూమిని కబ్జా చేసి వరి పొలం వేశాడని తెలుసుకొని క్రీడ మైదానంలో వేసిన పంటను తొలగించాలని హెచ్చరించినప్పటికీ దౌర్జన్యంగా క్రీడా మైదానంలో పంట సాగు చేస్తున్నాడని ఆమె తెలిపారు. క్రీడా మైదానం కబ్జా చేసిన వ్యక్తికి నోటీసులు జారీ చేశారా అని అడిగిన ప్రశ్నకు నోటీసులు అందించమని ఎంపీడీవో తెలియజేశామని ఆమె తెలిపారు.

### గ్రామపంచాయతీ క్రీడా ప్రాంగణాన్ని కబ్జా చేసిన అతనిపై ఎల్‌టిఆర్ కేసు నమోదు చేయాలి

ప్రగల్లపల్లి గ్రామ పంచాయతీకి చెందిన బైరాగులుపాడు క్రీడా మైదాన ఎకరం స్థలాన్ని కబ్జా చేసి వరి పొలం సాగు చేస్తున్న గిరిజనేతరుడిపై ఎల్ టి ఆర్ కేసు నమోదు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని స్థానిక గ్రామపంచాయతీ ప్రజలు ఆదివాసీలు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం అధికారులు ఈ కబ్జా కోరుపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటేనే మునుముందు మండలంలో అనేక గ్రామపంచాయతీలలో క్రీడా మైదానాలు కబ్జాకు గురికాకుండా కాపాడబడతాయని క్రీడా మైదానాలని ఆక్రమించుకొని అనుభవించవచ్చనే దురాలోచన అక్రమాలు పెరిగిపోతుందని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆ క్రీడా మైదానంలో ఏర్పాటుచేసిన క్రీడా పరికరాలు ధ్వంసం చేసినందుకుగాను ఆ వ్యక్తిపై చట్టపరంగా శిక్షించడంతోపాటు ఆ క్రీడా మైదానం ఏర్పాటు చేసినందుకు అయిన ఖర్చు రూపాయలు నష్టపరిహారం రూపంలో కట్టించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




### పంచాయతీరాజ్ అధికారులకు స్థలాన్ని కేటాయించాం: తాహాసిల్దార్ అశోక్ కుమార్

క్రీడ మైదానం కొరకు ప్రభుత్వ భూమిని పంచాయతీరాజ్ అధికారులకు కేటాయించామని వారు ఆ ప్రభుత్వ భూమిని క్రీడా ప్రాంగణాన్ని ప్రొటెక్షన్ చేసుకోవాలని ఏదైనా సమస్య ఉంటే మాకు వినతి పత్రం అందిస్తే దానిపై చర్యలు తీసుకుంటామని తాహాసిల్దార్ అశోక్ కుమార్ మహా పత్రిక ప్రతినిధికి వివరణ ఇచ్చారు.

### ఆక్రమణ గురైంది వాస్తవమే.. ఆ భూమిని స్వాధీనం చేసుకుంటాం: ఎంపీడీవో వివేక్

క్రీడా ప్రాంగణాన్ని అక్రమించడం నేరం తమ దృష్టికి వచ్చిందని రెవెన్యూ అధికారులకి తెలియజేసి స్వాధీనం చేసుకుంటామని, నేడు స్థలాన్ని పరిశీలించి సంబంధిత వ్యక్తి నుంచి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని ఎంపీడీవో వివేక్ రామ్ వివరణ ఇచ్చారు.

# అంగరంగ వైభవంగా ముగ్గుల పోటీలు





**బూర్గంపహాడ్ మహా:** బూర్గంపాడు మండలం సారపాక పట్టణ కేంద్రంలో హెచ్ ఆర్ పి ఎస్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా సారపాక గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్, ఉప సర్పంచ్ కన్నెదారి రమేష్, మాజీ పిఎసిఎస్ ఛైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, ఐ ఎన్ టి యు సి రాష్ట్ర నాయకులు మారం వెంకటేష్ రెడ్డి , మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు వరాల వేణు లు పాల్గొన్నారు. న్యాయ నిర్ణయతలుగా మాజీ ఎమ్మెల్యే మాజీ ఎంఈఓ వెంకటేశ్వరరావు,లీగల్ అడ్వైజర్ రంగు రామచంద్రయ్య, పోలపెల్లి సుధాకర్ రెడ్డి, ఐటీసీ కాంట్రాక్టర్ రాంబాబు లు పాల్గొన్నారు. గెలుపొందిన మొదటి బహుమతిగా డ్రెస్సింగ్ టేబుల్, ద్వితీయ బహుమతి మిక్సీ, తృతీయ బహుమతి గ్యాస్ పొయ్యి మరియు పాల్గొన్న వారందరికీ కన్సిలేషన్ బహుమతులు అందజేసినారు ఈ సందర్భంగా జరిగిన సభలో కిషోర్ నాయక్ పాల్గొని మాట్లాడుతూ నేషనల్ వుమెన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ వారు సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు రంగుల పోటీలు నిర్వహించడం సంతోషకరమైన అంశం అని అన్నారు . ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం కోసం సూవిశాలమైన ప్రదేశాన్ని ఎంచుకొని నిర్వహించారని అన్నారు . ఈ సందర్భంగా సంక్రాంతి శుభాకాంక్షలు అడ్వాన్స్ గా తెలియజేసినారు ఈ కార్యక్రమంలో వందల సంఖ్యలో మహిళలు పిల్లలు భాగస్వాములు అయినారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్పిఎస్ జిల్లా అధ్యక్షులు డొంకన చంద్రశేఖర్ జనరల్ సెక్రటరీ కోమటిరెడ్డి మోహన్ రెడ్డి ఉపాధ్యక్షులు దామెర ఆదినారాయణ నియోజకవర్గ అధ్యక్షులు కారం హనుమంతరావు జాయింట్ సెక్రెటరీ నాగోజు భాస్కరరావు మండల అధ్యక్షులు దుగ్గంపూడి వెంకటరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షులు కొప్పుల జయ, నియోజవర్గ అధ్యక్షురాలు తోకల జ్యోతి జిల్లా కార్యదర్శి సుల్తానా, మండల అధ్యక్షురాలు గుగులోతు సోనా, నియోజవర్గ ట్రెజరర్ సమ్మక్క, మండల సభ్యులు కనితి నాగయ్య, కిరణ్, కే జ్యోతి, టీ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు



## టెట్ పరీక్షలు ప్రశాంతం

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో టెట్ పరీక్షలు ఆదివా రం అబ్దుల్ కలాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ సైన్సెస్‌లో ప్రశాంతంగా ఎలాంటి అవాంఛ నీయ సంఘ టనలు లేకుండా సజావుగా నిర్వహిం చినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, సెషన్-1లో మొత్తం 100 మందికి పరీక్ష కేటాయించగా 89 మంది హాజరై11 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే సెషన్-2లో కూడా మొత్తం 100 మందికి పరీక్ష కేటాయించగా 88 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరై 12 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షల నిర్వహణకు నియమించిన అధికారులు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించడంతో పరీక్షలు ప్రశాంతంగా పూర్తయ్యాయని తెలిపారు. జిల్లా యంత్రాంగం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షణ చర్యలు తీసుకోవడం వల్ల టెట్ పరీక్షలు విజయవంతంగా నిర్వహించగలిగామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## పర్ణశాలలో ధనుర్మాస వ్రత మహోత్సవం

**మహా దుమ్ముగూడెం:** ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాల శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవాలయంలో ధనుర్మాస వ్రత కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి. ముందుగా స్వామివారికి తెల్లవారుజామున ఆలయ తలుపులు తీసి సుప్రభాతము ధనుర్మాస వ్రత సేవా కలం తదుపరి బాలభాగ నివేదన, చేసినా అనంతరం మూలమూర్తులకు పంచామృతులకు అభిషేకం నిర్వహించారు. అందులో భాగంగా ఆదివారం 27వ పాశురం కుడరై వెళ్ళు గోవిందా అని విశేష పాశురం ఆండాలమ్మ వారికి 108 గిన్నెల పాయాసాన్ని నింపి ఆరేగింపు చేసిన తర్వాత అమ్మవారికి ఈ యొక్క పాశురం తో హారతినీ ఇచ్చారు. భక్తులు గ్రామస్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శేషం కిరణ్ కుమార్ చార్యులు, భార్గవచార్యులు, ఆలయ ఇన్చార్జి వాసు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## కోడి పందాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు

### తల్లాడ ఎస్సై వెంకటకృష్ణ



**తల్లాడ, జనవరి 11, (మహా న్యూస్):** అసాంఘిక శక్తులపై తల్లాడ ఎస్సై వెంకటకృష్ణ తనదైన శైలిలో ఉక్కు పాదం మోపుతున్నారు. మండలంలో అనేక కేసులను చేధించి తన మార్కును చూపెడుతున్నారు. ఆదివారం తల్లాడ మండలం బాలపేట గ్రామ శివారులో కోడిపందాలు నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు తల్లాడ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకొని మరో నలుగురు పరారీలో ఉన్నట్లు తల్లాడ ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. నిందితుల నుండి 19, 050 నగదు, 4 కోళ్లను,12 కత్తులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కోడి పందాల నిర్వహకుడు వేముల శ్రీనుపై గతంలో కూడా ఇటువంటి కేసులలో ఉన్నట్లు గుర్తించామని, ఇతనిపై సస్పెక్ట్ షీట్ తెరవబడుతుందన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు, పేకాట జరగకుండా తీసుకుంటున్న చర్యలలో భాగంగా గతంలో కోడి పందేలు, జూదం నిర్వహించిన వారిని గుర్తించి బైండోవర్ చేస్తునట్లు పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని చైనా మాంజాను విక్రయించే దుకాణాలు, గోదాంలు, మార్కెట్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. చైనా మాంజాను ఉపయోగించి గాలిపటాలు ఎగురవేసే సమయంలో అనేక పక్షులు, పశువులు, ప్రజలు, ముఖ్యంగా బైక్లపై ప్రయాణించే వారు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. చైనా మాంజాను విక్రయించడం, కొనుగోలు చేయడం పర్యావరణ పరిరక్షణ చట్టం-1986 ప్రకారం నేరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే జైలు శిక్షతో పాటు రూ.10 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మైనారిటీ గురుకులంలో ఐదో తరగతి ప్రవేశాలకు ఆహ్వానం

**బూర్గంపహాడ్ మహా:** బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి గాను ఐదవ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ పి వెంకట గీత జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఐదవ తరగతిలో 40 సీట్లకు గాను , 30 మైనారిటీలకు , 5 బీసీ లకు, 2 ఎస్సీ లకు, 2 ఎస్టీ లకు, 1 ఓసీ సీట్లు కలవని, ప్రవేశాల కోసం విద్యార్థులు నేరుగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవచ్చని, పూర్తి వివరాల కోసం 9553745430 (ప్రిన్సిపాల్), 7995057880(పాఠశాల) ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.ఈ అవకాశాన్ని అర్హత కలిగిన విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సిపిఐ వందేళ్ల మహాసభలను విజయవంతం చేయాలి



**తల్లాడ, జనవరి 11,(మహా న్యూస్):** ఎంతో ఘన చరిత్ర కలిగిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అని ఆ పార్టీ జిల్లా నాయకులు మద్దోజు శ్రావణ్ కుమార్ అన్నారు. ఆదివారం తల్లాడలో మండల కార్యదర్శి ఓర్సు రమేష్ అధ్యక్ష తన నిర్వహించింది ఏర్పాటుచేసిన సమావేశానికి శ్రవణ్ కుమార్ హాజరై మాట్లాడారు. భారత గడ్డపై సిపిఐ పుట్టి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 18న జరిగే సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ అంటే పేదోడి జెండా అని ఈ పార్టీని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందన్నారు. ఈ సభలో 5 లక్షల మంది భారత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొంటారని, 40 దేశాల నుండి ప్రతినిధులు హాజరవుతారు అన్నారు. మతోన్మాద శక్తుల్ని తరిమికొట్టే విధంగా ఆ సభకు పదివేల మంది రెడ్ వాలంటీర్ల తో కవాతు ఉండబోతోందినీ, ఇది భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో మిగిలిపోయే సభగా ఈ సభ ఉంటుందన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ అమరవీరుల సాక్షిగా వారిని స్తుతించుకుంటూ సభ కాబట్టి ఈ యొక్క సభను ప్రతి ఈ సభలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. రైతు సంఘం జిల్లా నాయకులు నల్లమోతు నరసింహారావు, స్వర్ణ రమేష్, పటాన్ జాన్ పాషా పాల్గొన్నారు.

# గేటు కారేపల్లిలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**కారేపల్లి, మహా:** కారేపల్లి మండల గేట్ కారేపల్లిలో ఆదివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలు గ్రామపంచాయతీ కార్యదర్శి కె. అనూష, సర్పంచ్ పూసం ఎల్లయ్య,పాలకమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు పగడాల మంజుల ముఖ్య అతిథిగా హాజరైనారు. గ్రామంలో భోగి మంటలు వేసి చెడు పోయి కొత్త పాలకమండలి ఆధ్వర్యంలో శుభాలు జరగాలని వారు ఆకాంక్షించారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించారు, ఈ ముగ్గుల పోటీలలో మహిళా, యువతులు ఉత్సవంతంగా పాల్గొన్నారు. ఈ ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఎంతో టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో మన సాంప్రదాయాన్ని సంస్కృతులను కాపాడేవి పండగలన్నారు. ఈ కొత్త పాలక వర్గం గేట్ కారేపల్లి గ్రామాన్ని అభివృద్ధిలో ముందంజలో ఉంచాలని వారు ఆకాంక్షించారు. అనంతరం సొసైటీ మాజీ అధ్యక్షులు దుగ్గినేని శ్రీనివాసరావును సన్మానించారు . ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కందుల శ్రీనివాస్, వార్డు సభ్యులు,గేటు కారేపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సాయిని తిరుపతయ్య, చెరుకూరి వెంకటేశ్వర్లు, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.





# సత్తుపల్లిలో భారీ సైబర్ దోపిడీ

**సత్తుపల్లి, మహా:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి కేంద్రంగా సాగుతున్న భారీ అంతర్జాతీయ సైబర్ నేరాల ముఠాను పోలీసులు గుట్టురట్టు చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన పేరుతో వల విసిరి, సుమారు 547 కోట్ల రూపాయల మేర మోసాలకు పాల్పడిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదివారం పెనుబల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. గత నెల 24వ తేదీన సత్తుపల్లి మండలం తుంబూరు గ్రామానికి చెందిన మోదుగ సాయికిరణ్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ భారీ ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఈ ఫిర్యాదుపై లోతుగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు, సత్తుపల్లికి చెందిన పోట్రు మనోజ్ కళ్యాణ్, ఉడతనేని వికాస్ చౌదరి నేతృత్వంలోని గ్యాంగ్ ఈ వ్యవస్థీకృత నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ ముఠాకు వివిధ రూపాల్లో సహకరించిన మరో 18 మందిని పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు.

### విస్తుపోయేలా బ్యాంక్ లావాదేవీలు

కేసు విచారణలో భాగంగా నిందితులు, వారి కుటుంబ సభ్యులు, అనుచరుల బ్యాంక్ ఖాతాలను పరిశీలించిన పోలీసులకు దిగ్భ్రాంతి కలిగించే అంశాలు వెల్లడయ్యాయి. ప్రధాన నిందితుడు పోట్రు మనోజ్ కళ్యాణ్ ఖాతాలో రూ.114.18 కోట్లు, అతని భార్య మేడా భానుప్రియకు చెందిన రెండు ఖాతాల్లో రూ.45.62 కోట్లు, మనోజ్ బామ్మర్ది మేడా సతీష్ ఖాతాలో రూ.135.48 కోట్లు ఉన్నట్లు గుర్తించారు. అలాగే బొమ్మిడాల నాగలక్ష్మి ఖాతాలో రూ.81.72 కోట్లు, కరీంనగర్‌కు చెందిన తాటికొండ రాజుకు చెందిన నరసింహా కిరాణం అండ్ డెయిరీ ఖాతాలో రూ.92.54 కోట్లు, మరో ప్రధాన నిందితుడు ఉడతనేని వికాస్ చౌదరి ఖాతాలో రూ.80.41 కోట్ల భారీ లావాదేవీలు జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు.

### నిరుద్యోగుల ఖాతాలే పెట్టుబడిగా

ఈ ముఠా అనుసరించిన మోసపూరిత విధానం అత్యంత ప్రమాదకరంగా ఉంది. నిందితులు మొదట సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగ యువకులకు ఉద్యోగాల ఆశ చూపి వారిని పిలిపించుకునేవారు. అనంతరం వారితో ప్రముఖ బ్యాంకుల్లో ఖాతాలు తెరిపించి, ఆ ఖాతాలకు సంబంధించిన కీలక సమాచారాన్ని తమ ఆధీనంలోకి తీసుకునేవారు. ఆ ఖాతాలనే సైబర్ నేరాల ద్వారా వచ్చిన కోట్లాది రూపాయల సొత్తును దాచడానికి వినియోగించేవారు. అంతర్జాతీయ సైబర్ నేరస్థులతో సంబంధాలు కలిగి ఉన్న ఈ ముఠా, విదేశాల నుంచి కాల్ సెంటర్లు నిర్వహిస్తూ పెట్టుబడులు, మ్యాట్రిమోనీ, రివార్డు పాయింట్లు, ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, షేర్ మార్కెట్, క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ పేరుతో దేశవ్యాప్తంగా అమాయక పౌరులను బురిడీ కొట్టిస్తోంది. బాధితులను టెలిగ్రామ్ గ్రూపుల్లో చేర్చి, మోసపూరిత లింకుల ద్వారా వారి ఖాతాలను పూర్తిగా ఖాళీ చేస్తున్నారు.

### క్రిప్టో కరెన్సీ రూపంలోకి నగదు మళ్లింపు

నేరాల ద్వారా వచ్చిన సొమ్మును గుట్టుచప్పుడు కాకుండా మళ్లించడంలో నిందితులు ఆరితేరిపోయారు. మొదట ఏజెంట్ల ద్వారా తెరిపించిన బ్యాంక్ ఖాతాల్లోకి సొమ్మును బదిలీ చేసి, అక్కడి నుండి కొన్ని కరెంట్ ఖాతాలకు మళ్లించేవారు. చివరగా ఆ డబ్బును తమ వ్యక్తిగత ఖాతాల్లోకి చేర్చి, యూఎస్ డాలర్లు, క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఇప్పటికే పోట్రు ప్రవీణ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు సహకరించిన ఇతర వ్యక్తులు, మరిన్ని బ్యాంకు ఖాతాల వివరాల కోసం క్షేత్రస్థాయిలో దర్యాప్తు కొనసాగుతోందని పోలీస్ కమిషనర్ తెలిపారు. నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా యువత ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశతో నేరస్థుల వలలో పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు.

05

FOLLOW: @ANNTELUGU

12-1-2026

WWW. EPAPER.MAHAADAILY.COM

భద్రాద్రి కొత్తగూడెం

మహా పత్రిక

ANN తెలుగు

# నికార్సైన మార్క్సిస్టు రేమల్లె బిక్షం



**కారేపల్లి, మహా:** సీనియర్ సీపీఐ(ఎం) సభ్యులు తవిసిబోడు కు చెందిన రేమల్లె బిక్షం(90) ఆదివారం మృతి చెందారు. వృద్ధాప్య అనారోగ్యం తో బాధపడుతూ బిక్షం మృతి చెందాడు. మృతదేహాన్ని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే. నరేంద్ర లు సందర్శించి పార్టీ పతాకాన్ని కప్పి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితాంతం కమ్యూనిస్టుగా, కూలి, భూమి కోసం వర్గ పోరాటాలు నిర్వహించిన నికార్సైన మార్క్సిస్టు రేమల్లె బిక్షం అని కొనియాడారు. రేలకాయలపల్లి ప్రాంతంలో పేదలకు పోడుభూమి, నివాసాలకు ఇళ్ల స్థలాలు కోసం పోరాటాలకు నేతృత్వం వహించారన్నారు. ఆమరజీవులు ఏలూరు లక్ష్మీనారాయణ, కేవిల్ నరసింహారావు, శీలం రాజయ్య సమకాలికులు గా ప్రజా సమస్యల మీద అనేక పోరాటాలు నిర్వహించిన ఘనత రేమల్లె బిక్షం కు దక్కిందన్నారు. మండలంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడుగా గుర్తింపు పొందిన రేమండ్ల బిక్షం మృతి పార్టీకి కి తీరని లోటన్నారు. కమ్యూనిస్టుగా ఆయన ఒక్కడే కాకుండా ఆయన కుటుంబం, బంధుమిత్రులు మొత్తాన్ని సీపీఐ(ఎం) లో నిలపడంలో రేమల్లె బిక్షం పాత్ర శ్లాఘనీయన్నారు. నేటి పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడటమే రేమల్ల బిక్షం గారికి ఇచ్చే నిజమైన ఇవ్వాలి అని తెలిపారు. ఈ సంతాప సభలో నాయకులు మన్నెం బ్రహ్మయ్య, ద్దెల నాగయ్య, పార్టీ మండల కమిటీ సభ్యులు రేగళ్ల మంగయ్య, యనమనగండ్ల రవిబాబు, రేమల్ల వీరస్వామి, రేమల్లె జయపాల్, రేమల్లె బాబు, నునావత్ వెంకన్న, దొంతసర్ప లాలయ్య, చింతాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీకి కట్టుబడిన రేమల్ల బిక్షం: పీ.సోమయ్య

ప్రజా సమస్యలపై పోరాటాలతో పాటు నిజాయితీ కట్టుబడి రేమల్ల బిక్షం పని చేశారని సిపిఎం రాష్ట్ర నాయకులు పి.సోమయ్య అన్నారు. రేపల్లె బిక్షం మృతి వార్త తెలుసుకున్నాయన కుటుంబ సభ్యుల కు సానుభూతిని తెలిపారు పార్టీలో సీనియర్ కామ్రేడ్ అయినా రే మల్ల బిక్షం తనకు సన్నిహితు డన్నారు. కామేపల్లి మండలం ఊట్కూరులో పుట్టి పెరిగినాయన అక్కడ పార్టీ నిర్మాణంలో ముఖ్య భూమిక పోషించి కారేపల్లి మండలం చీమల పాడు వచ్చి పార్టీ సభ్యుడు గానే కొనసాగారన్నారు. నిజాయితీ కలిగిన పార్టీ సభ్యులు బిక్షం మృతి చాలా బాధాకరమన్నారు.




# బిఆర్ఎస్‌కి పూర్వ వైభవం ప్రారంభమైంది

**తల్లాడ మహా:** బిఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం ప్రారంభమైందని, భవిష్యత్తులో సాధించబోయే అఖండ విజయాలకు సత్తుపల్లి గడ్డ ఒక పునాది వేసిందని సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య పేర్కొన్నారు. తెలంగాణ సర్పంచ్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ విజయం రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చిందని చెప్పారు.సత్తుపల్లి గడ్డ లో గులాబీ జెండా మళ్లీ రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు.మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు అధ్యక్షతన తల్లాడ మండలం నరసరావుపేట గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ మద్దతుతో నూతనంగా ఎన్నికైన ఉపసర్పంచ్ శనక్కాయల సత్యనారాయణను మరియు వార్డు సభ్యులను ఆదివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ముఖ్యఅతిథిగా మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య పాల్గొని వారిని ఘనంగా సత్కరించారు. అంతకుముందు బిఆర్ఎస్ పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో భారీ బైకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో బిఆర్ఎస్ పార్టీ చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు అత్యధిక మెజార్టీతో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు పట్టం కట్టారని పదేళ్ల పాలనలో కేసీఆర్ ఎప్పుడు ప్రజలను మోసం చేయలేదని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రెడ్డెం వీర మోహన రెడ్డి,దుగ్గిదేవర వెంకటలాల్,మువ్వ మురళి,పట్టణ యువజన నాయకులు జి.వి.ఆర్,నూతన సర్పంచులు,వార్డ్ మెంబర్లు,నాయకులు పాల్గొన్నారు.



# తల్లాడలో సంక్రాంతి సంబరాలు



**తల్లాడ,మహా:** తల్లాడ లో స్థానిక బాల భారతి స్కూల్ నందు సంక్రాంతి సంబరాల్లో భాగంగా మహిళల ముగ్గుల పోటీ కాపు సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మేజర్ గ్రామపంచాయతీ తల్లాడ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ను, అదేవిధంగా . మండలాల్లో ఉన్నటువంటి వివిధ గ్రామపంచాయతీలో ఉన్నటువంటి కాపు సర్పంచులను ఉప సర్పంచులను. ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానించడం జరిగింది. అనంతరం తల్లాడ మున్నూరు కాపు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో గెలుపొందిన విజేతలకు గ్రామ పంచాయతీ సర్పంచ్ ల చేతుల మీదుగా ప్రథమ ,ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుపొందిన విజేతలకు అందించడం జరిగింది. ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతిగా నరాల ఉషారాణికి తల్లాడ మేజర్ పంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వర చేతుల మీదుగా, ద్వితీయ బహుమతిని, తోట రామారావు రామచంద్రపురం సర్పంచ్ చేతులమీదుగా నరాల మౌనికకు, తృతీయ బహుమతిని మంగాపురం సర్పంచ్ దుగ్గిదేవర నాగ నరసింహారావు. చేతులమీదుగా దగ్గుల మౌనికకు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా మండలంలో ఉన్నటువంటి కాపు సంఘానికి సంబంధించిన పట్టణ మండల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 25వ డివిజన్‌లో ముగ్గుల పోటీలు

**ఖమ్మం ,మహా:** 25వ డివిజన్ రిక్క బజార్ సెంటర్ అమ్మ భవాని గుడి దగ్గర స్థానిక కార్పొరేటర్ గోళ్ళ చంద్రకళ వెంకట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేయర్ పూనుకోల్లు నిరజ పాల్గొని పర్యవేక్షించి ముగ్గుల పోటీలలో పాల్గొని చక్కటి ముగ్గులను వేసి రంగులతో అద్ది సంతోషకరమైన వాతావరణని నింపిన డివిజన్ ప్రజలను మరియు స్థానిక కార్పొరేటర్ ను మరియు సహాయ సహకారాలు అందించిన డివిజన్ నాయకులను అభినందించారు . తెలుగు మహిళలసంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక ముగ్గులు అని అన్నారు .




# ఎమ్మెల్యే చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరణ



**కారేపల్లి, మహా:** సింగరేణి మండల కాంగ్రెస్ నాయకుడు ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు ధారావత్ వినోద్ నాయక్ రూపొందించిన 2026 సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్ చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ క్యాలెండర్‌లో కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, నాయకుల చిత్రాలు, ప్రజా సంక్షేమ లక్ష్యాలు ప్రతిబింబించేలా రూపకల్పన చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూౌ ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, కార్యకర్తల సమష్టి కృషితో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొణిజర్ల ఎస్సై ,వైరా ఎస్సై ,పుష్పాల రామారావు, ,మండల, గ్రామస్థాయి నాయకులు, యువకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# నర్సాపురంలో సంక్రాంతి సంబురాలు

## గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు





**జూలూరుపాడు, మహా:** మండల పరిధిలోని పడమట నర్సాపురం గ్రామ పంచాయితీ నూతన పాలకమండలి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ స్థాయి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 13వ తేదీ (మంగళవారం) మధ్యాహ్నం 2 గంటల నుంచి గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ఆవరణలో జరగనున్నాయి. పోటీల్లో పాల్గొనదలచిన వారు తమ పేర్లను 12వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన ఐదుగురు విజేతలకు నగదు బహుమతులతో పాటు, చీరను అందజేయనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి: రూ.5,116, రెండవ బహుమతి: రూ.4,116,మూడవ బహుమతి: రూ.3,116, నాలుగవ బహుమతి: రూ.2,116, ఐదవ బహుమతి: రూ.1,116 ను అందజేయనున్నట్లు తెలిపారు. పోటీదారులు ముగ్గుకు అవసరమైన సామగ్రిని స్వయంగా తెచ్చుకోవాలని, ఒక్క పోటీదారు ఒక హెల్పర్‌ను ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. అదేవిధంగా పోటీదారులు రెండు గంటల సమయంలోనే ముగ్గు పూర్తి చేయాల్సి ఉంటుందని అన్నారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు విజేతలకు అతిథులు, గ్రామ పెద్దలు చే బహుమతుల ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. పేరు నమోదు కొరకు 9908410304, 9949542538 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

# లయన్స్ హంగర్ సర్వీస్ ముగింపు వేడుకలు





**సత్తుపల్లి, మహా:** సమాజం నుంచి ఎంతో పొందాము కనుక సమాజానికి తిరిగి కొంతైనా ఇద్దాం...చేద్దాం. అనే స్ఫూర్తితో పేదల ఆకలి తీర్చడమే ధ్యేయంగా సతుపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన హంగర్ సర్వీస్ వారోత్సవం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా సత్తుపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు గోగడ రవి అధ్యక్షతన స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద హంగర్ సర్వీస్ ముగింపు కార్యక్రమం జరిగింది.

### సహకారానికి సత్కారం...

నిరుపేదల ఆకలి తీర్చడమే ధ్యేయంగా వారం పాటు చేపట్టిన హంగర్ వారోత్సవం విజయ వంతం కావటానికి సహకరించిన సత్తుపల్లి డివిజన్ ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షులు పసుపులేటి నాగేశ్వరరావు తో పాటు పట్టణానికి చెందిన రాంబాబు, మిద్దె శ్రీను, రహ్మద్ పాషా, వాహిద్, సన్నీ లను సత్కరించారు.

### 792 రోజులుగా వీల్స్ ఆన్ మీల్స్...

వృద్ధులు, యాచకులు, పేదలకు ఉదయం పూట అల్పాహారం అందించేందుకు చేపట్టిన వీల్స్ ఆన్ మీల్స్ కార్యక్రమం ఆదివారం నాటికి 792 రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి , బస్టాండ్ సెంటర్ లో గత 792 రోజులుగా క్రమం తప్పకుండా అల్పాహారం అందించారు. లయన్స్ క్లబ్ సభ్యులుతో పాటు పట్టణం లోని దాతలు ఇందుకు సహకరించారు.

### ఈ సేవలు నిరంతరం...

ప్రజలకు సేవలందించడంలో రాష్ట్రంలో సత్తుపల్లి లయన్స్ క్లబ్ అగ్రస్థానంలో ఉందని క్లబ్ నిర్వాహకులు పేర్కొన్నారు. ఉచిత అంబులెన్స్ సౌకర్యం , నేత్రదానం, హెల్త్ క్యాంప్స్ తదితర సేవలు నిరంతం కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు మందపాటి ప్రభాకరరెడ్డి, దారా కృష్ణారావు, గండ్ర సోమిరెడ్డి, కొత్తూరు ప్రభాకర్ రావు, పెనుగొండ రమేష్, గండ్ర సోమిరెడ్డి, వెల్ది జగన్ మోహన్ రావు, రమణ, సలీం, గార్లపాటి సత్యనారాయణ,కేశవరావు, చల్లగుండ్ల అప్పారావు, మందపాటి చెన్నారెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నేడు స్టేడియంలో ముగ్గుల పోటీలు







**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళ కాంగ్రెస్, రెవిన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 3 గంటల నుండి కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ముత్యాల ముగ్గుల పోటీ నిర్వహిస్తున్నట్టు భద్రాద్రి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు దేవిప్రసన్న తెలిపారు. ఆదివారం ప్రకాశం స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆమె మాట్లాడుతూ కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 33 డివిజన్ ల నుండి మహిళలు పాల్గొంటారని విజేతలకు రాష్ట్ర రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసహాయం రఘు రాంరెడ్డి బహుమతులు అందిస్తారని తెలిపారు. 1వ బహుమతి 30 వేలు, 2వ బహుమతి 25 వేలు, 3వ బహుమతి 20 వేలు, 4వ బహుమతి 15 వేలు, 5వ బహుమతి 10 వేలు, కన్సోలేషన్ బహుమతులు (ఐదుగురికి) 5 వేలు చొప్పున ఇవ్వనున్నామన్నారు. ఇవే ముగ్గుల పోటీలో పాల్గొనే ప్రతి ఒక్కరికి ఆకర్షణీయమైన బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. పోటీలో పాల్గొనే వారు సొంతంగా ముగ్గులు రంగులు తెచ్చుకోవాలని, కేవలం 1 గంటలోనే ముగ్గు వేయాలని విజేతల ప్రకటన అంతిమ నిర్ణయం జడ్జిలదేనని తెలిపారు. ఇప్పటికే ఈ పోటీలకు పేర్లను నమోదు చేసుకుంటున్నారు. పోటీల ప్రారంభ సమయానికి ముందు వరకు కూడా పేర్లను నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. వివరాలకు ఈ కింద ఉన్న నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ పాత్రికేయ సమావేశంలో ఐఎన్టీయుసి వైస్ ప్రెసిడెంట్స్ ఎండి రజాక్, పితాంబరం, రైల్వే బోర్డు సభ్యులు వై శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ రాంబాబు, మైనారిటీ జిల్లా ఉపాధ్యక్షులు కరీం పాషా, ఓబీసీ వెంకట్ యాదవ్, మహిళ నాయకురాళ్లు ఆకునూరి సుప్రియ, హైమావతి, రమాదేవి, పుష్పలత, అమడగాని రాజకుమారి, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ కష్టాలు తీరేదెన్నడో?

## ప్రధాన రోడ్డు పక్కనే ఆటోలు నిలిపివేత.. ఇబ్బంది పడుతున్న ద్విచక్ర వాహనదారులు





**భద్రాద్రి బ్యూరో, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య పట్టి పీడిస్తోంది. వాహనాల రద్దీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం పలు కూడళ్లలో సక్రమంగా ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో వాహనాలను ఇష్టం వచ్చినట్లు నడపడంతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. పట్టణ సమగ్రాభివృద్ధికంటూ కచ్చితమైన మాస్టర్ ప్లాన్, పట్టణ ప్రధాన రోడ్లపై పక్కా ప్రణాళికలు లేకపోవడం ఇందుకు ప్రధాన కారణమైనప్పటికీ పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. గత కొంతకాలంగా ట్రాఫిక్ సమస్య పెచ్చుమీరిపోతున్నది. జిల్లా కేంద్రంగా ఏర్పడిన అనంతరం నుంచే ఈ సమస్యలు మొదలయ్యాయి. దీనికి తోడు కొత్తగూడెం నియోజకవర్గం మున్సిపల్ కార్పొరేషన్ కాగా, అప్పటి నుంచి వాహనాల రద్దీతో ట్రాఫిక్ పెరిగి పోయింది. సహజంగానే జిల్లా కేంద్రానికి వందల సంఖ్యలో ప్రజలు అవ సరాల నిమిత్తం వస్తూ పోతూ ఉంటారు. దీంతో వాహనాల రద్దీ ఏర్పడి సమస్యగా మారింది. అప్పుడప్పుడు చేపట్టిన రోడ్ల వెడల్పు, విస్తరణ పనులు తప్ప పూర్తిస్థాయిలో ట్రాఫిక్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలైతే లేవని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఇదిలా ఉండగా బస్టాండ్ సెంటర్లోని ప్రధాన రోడ్ల పక్కన ఆటోలను ఇష్టారాజ్యంగా నిలుపుదల చేయడం వల్ల ద్విచక్ర వాహనదారులతో పాటు పలువురు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ప్రజలు వేడుకుంటున్నారు.

# రాష్ట్రంలో నివాసయోగ్య నగరంగా ఖమ్మం



**ఖమ్మం ,మహా:** రాష్ట్రంలో నివాస యోగ్య నగరంగా ఖమ్మం ముందు వరుసలో ఉందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.మంత్రి తుమ్మల ఆదివారం ఖమ్మం నగరం 54వ డివిజన్ లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ పార్క్ ను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన పార్క్ ను మంచిగా నిర్వహణ చేస్తూ, ఇంకనూ కావాల్సిన సిసి కెమెరాలు, గ్రాస్ కార్పెట్ తదితరాలను సమకూర్చుకోని అభివృద్ధి పర్చుకోవాలన్నారు. రోడ్లను ఆక్రమించుకోవద్దని, పేదలకు గృహ వసతి కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రోడ్ల విస్తరణకు సహకరించాలని అన్నారు. నీటి ప్రవాహానికి అడ్డంకులు పెట్టడంతో సమస్యలు వస్తున్నాయని, అధికారుల ప్లాన్ ప్రకారం సహకరించాలని అన్నారు. ఇబ్బందులు తాత్కాలికంగా ఇబ్బందులు వచ్చిన విస్తరణతో అభివృద్ధి తో పాటు వ్యాపారాలు మంచిగా జరుగుతాయని అన్నారు. కొంతమందికి ఇబ్బంది కల్గిన, ఎంతో మందికి లబ్ది చేకూరుతుందని అన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి తెలిపారు. తెలంగాణ లో ఖమ్మం నగరం ఒక్కటే నివాసయోగ్య నగరంగా మారిందని, శాంతి భద్రతలు, పచ్చదనం, పరిశుభ్రత పాటిస్తే అంత అభివృద్ధి సాధ్యమని అన్నారు. జాతీయ రహదారులు ఖమ్మం మీదుగా వెళుతున్నాయని, రాబోయే కొద్దీ రోజుల్లో రాజమండ్రి కి గంటన్నర, హైదరాబాద్ కు రెండున్నర గంటల్లో వెళ్లొచ్చని అన్నారు. ప్రజలు రోడ్ల వెడల్పుకు సహకరిస్తే, ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని, రోడ్ల వెడల్పుతో వ్యాపారం అభివృద్ధి తో పాటు, నగరం అందంగా ఉంటుందని మంత్రి అన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యంగా వుండే నగరం అందించే బాధ్యత అందరిపై ఉందని, కాలుష్యం తగ్గించాలని, నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని మంత్రి అన్నారు. ప్రజలకు ఉపయోగకరమైన పనులు నగరంలో చేపడుతున్నామని, ఈ పనులను స్థానిక నాయకులు, అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించి నాణ్యతతో, త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని మంత్రి అన్నారు. ఖమ్మం నగర జనాభా 5 లక్షలకు చేరిందని, రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా త్రాగునీటి సరఫరా, నూతన డ్రెయిన్ లు, రోడ్డు సౌకర్యం, పేదలకు ఇండ్లు వంటి అనేక కార్యక్రమాలను చేయాలని, దీనికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనుమంత రావు, స్థానిక కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల, కార్పొరేటర్లు, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, డిఇ ధరణి కుమార్,వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మెగాస్టార్ చిరంజీవి నటించిన "మన శంకర వరప్రసాదు చిత్రం సూపర్ హిట్ ఖాయం

**ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఎవరు ఎన్ని కుట్రలు కుతంత్రాలు పన్నిన మెగాస్టార్ చిరంజీవి సంక్రాంతి మూవీ "మన శంకర వరప్రసాదు చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ కావడం ఖాయమని సినీ గీత రచయిత అభ్యుదయ కళాసేవ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మైటీ మెగాస్టార్ చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంవత్సరం మెగాస్టార్ చిరంజీవి "మన శంకర వరప్రసాదు చిత్రంలో అద్భుతంగా నటించడం జరిగిందన్నారు. చిరంజీవి చిత్రాలలోనే ఇప్పటివరకు నంబర్ వన్ చిత్రంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. కానీ కొంతమంది కుట్ర దారులు మెగాస్టార్ చిరంజీవి ప్రతిభను ప్రగతిని చూసి అసూయపడే వారు నెగటివ్ ట్రోల్స్ చేస్తూ చిత్ర విజయాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారని కుట్రలు కుతంత్రాలు ఎన్ని చేసినా మెగాస్టార్ మన శంకర వరప్రసాద్ చిత్ర అఖండ విజయాన్ని ఆపలేరని అన్నారు. సంక్రాంతి పర్వదిన సందర్భంగా సోమవారం థియేటర్లలో "మన శంకర వరప్రసాదు చిత్రం విడుదలవుతున్న శుభ సందర్భంగా ప్రేక్షకులు ఆదరించాలన్నారు. చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్ చిత్రం అఖండ విజయాన్ని సాధించి బ్లాక్ బస్టర్ హిట్టుగా ఇండస్ట్రీ హిట్ గా విజేతగా నిలుస్తుందని మైటీ మెగాస్టార్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు అభ్యుదయ కళా సేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కవి సినీగీత రచయిత గాయకులు సమాజసేవకులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ఉద్ఘాటించారు.

# దొడ్డ నరేందర్ చిత్రపటానికి నివాళులు



**తల్లాడ మహా:** తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన దొడ్డ నరేందర్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. ఆదివారం ఆయన దశదిన కార్యక్రమం అన్నారుగూడెం గ్రామంలో వారి గృహంలో నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు హాజరై నరేందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాప సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట,భారతీయ జనతా పార్టీ మాజీ తల్లాడ మండల అధ్యక్షులు ఆపతి వెంకట రామారావు,బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు మారెళ్ళ దేవేందర్,ఆ పార్టీ మండల ఉపాధ్యక్షులు దొడ్డ చిన్న శ్రీనివాసరావు, ఆపతి రామారావు తదితరులు ఉన్నారు.

# శారమ్మకు నివాళులర్పించిన సర్పంచ్ గొడ్ల ప్రభాకర్



**తల్లాడ మహా:** తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన వినుకొండ శారమ్మ అనారోగ్యంతో ఆదివారం ఉదయం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ తో కలిసి శారమ్మ గృహాన్ని సందర్శించి. ఆమె భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సంతాప సానుభూతి తెలియజేశారు.అధైర్య పడవద్దని ధైర్యం కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శారమ్మ మృతి బాధాకరమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.కాగా శారమ్మకు ఇద్దరు కుమార్తెలు,ఒక కుమారుడు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు దొడ్డ చిన్న శ్రీనివాసరావు, అన్నారుగూడెం మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు దగ్గినేని సత్యనారాయణ, నాయకులు తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కట్కూరి రంగయ్య, ధారా సంతోష్ తదితరులు శారమ్మకు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

మహా పత్రిక
ANN తెలుగు

# చివరి రోజు గందరగోళం

- 69వ జాతీయ అండర్--17 కబడ్డీ పోటీల్లో అనర్హుల వివాదం
- పలు మార్లు కబడ్డీ పోటీలకు అంతరాయం
- డిఎస్పీ రంగ ప్రవేశం... సద్దుమణిగిన ఆందోళనలు







69వ జాతీయ అండర్--17 కబడ్డీ పోటీల్లోఆదివారం గందరగోళం చోటు చేసుకుంది. తెలంగాణ జట్టుపై యూపీ జట్టు గెలుపొందడంతో ప్రారంభమైన వివాదం ఆదివారం రాత్రి వరకు కొనసాగింది. ఉత్తరప్రదేశ్ టీమ్ నిబంధనలకు విరుద్ధంగా అధిక వయసు గల యువకులతో కబడ్డీ ఆట ఆడించిందని తెలంగాణ టీమ్ కు సంబంధించిన అధికారులు ఎన్‌టీఎఫ్ ఫిర్యాదు చేశారు. దీంతో ఉత్తర ప్రదేశ్ టీమ్ లో అనర్హులను గుర్తించి వారిని తదుపరి గేమ్ ఆడకుండా నిషేధించారు.

## కర్ణాటక టీం ఆందోళన

హర్యానా జట్టు నిబంధనలకు విరుద్ధంగా అధిక వయస్సు వారితో తమతో కబడ్డీ ఆడించారని కర్ణాటక టీం ఆదివారం సాయంత్రం నిరసనకు దిగింది. హర్యాన రాజస్థాన్ టీమ్ ల మధ్య సెమీఫైనల్ పోరు ప్రారంభానికి ముందు కర్ణాటక కబడ్డీ టీం సభ్యులు ఆందోళన చేపట్టారు. అనర్హులచే కబడ్డీ ఆడిపించడంతో తమ టీం ఓటమిపాలైందని కర్ణాటక టీం ప్రధాన ఆరోపణ. అధికారులు పలుమార్లు సర్ది చెప్పినప్పటికిని కర్ణాటక టీం వారు ఆందోళనకి దిగారు. దీనితో మణుగూరు డి.ఎస్.పి వంగ రవీందర్ రెడ్డి రంగ ప్రవేశం చేసి తమదైన శైలిలో హెచ్చరించారు. దీనితో వారు నిరుత్సాహంతో ఏడూళ్ళ బయ్యారం క్రీడా ప్రాంగణాన్ని విడిచి బయటకు వెళ్లారు.

## మధ్యలోనే గ్రౌండ్ విడిచి వెళ్లిపోయిన హర్యానా టీం

మూడవ స్థానం కోసం తెలంగాణ హర్యానా రాష్ట్ర జట్లు పోటీ పడగా ఆట ప్రారంభమైన పది నిమిషాలకే హర్యాన జట్టు గ్రౌండ్ విడిచి బయటికి వెళ్లింది. హర్యానా టీం లో సైతం నిబంధనలకు విరుద్ధంగా క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనితో వారు చేసేదేం లేక మధ్యలోనే గ్రౌండ్ ని విడిచి బయటకు వెళ్లారు. దీనితో తెలంగాణ జట్టు మూడవ స్థానం సరిపెట్టుకుంది.

## తప్పుడు ధృవీకరణ పత్రాలు... అధిక వయస్సు

పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో పినపాక మండలంలో నిర్వహిస్తున్న 69వ జాతీయ స్థాయి అండర్--17 బాలుర కబడ్డీ పోటీలు ముగింపు దశకు చేరుకున్నాయి. అయితే ఆదివారం జరగాల్సిన కీలక మ్యాచ్‌ల సందర్భంగా అనర్హులు, అధిక వయస్సున్న క్రీడాకారులను ఆడించారన్న ఆరోపణలతో కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ప్రీ--క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కర్నాటక -- రాజస్థాన్ జట్లు తలపడాల్సి ఉండగా, కర్నాటక జట్టు తప్పుడు ధృవీకరణ పత్రాలతో పాటు అధిక వయస్సు గల క్రీడాకారులను ఆడించిందన్న అభియోగాలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో నిర్వాహకులు కర్నాటక జట్టును పోటీ నుంచి తప్పించి, రాజస్థాన్‌ను విజేతగా ప్రకటించారు. దీంతో రాజస్థాన్ నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. సెమీఫైనల్‌లో రాజస్థాన్ -- హర్యానా జట్లు తలపడగా, మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఇరు జట్లు సమానంగా పాయింట్లు సాధించడంతో మ్యాచ్ టైగా ముగిసింది. దీంతో నిర్వాహకులు సూపర్ రైడ్‌కు అవకాశం కల్పించారు. ఉత్కంఠభరితంగా సాగిన సూపర్ రైడ్‌లో రాజస్థాన్ పైచేయి సాధించి ఫైనల్‌కు చేరుకుంది. ఇదే సమయంలో మధ్యాహ్నం జరిగిన మరో సెమీఫైనల్ మ్యాచ్‌లో ఉత్తర ప్రదేశ్ -- తెలంగాణ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో కూడా పలు జట్లు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. అనర్హులను ఆడించడం, ఒకరి స్థానంలో మరొకరిని మైదానంలోకి దింపినట్లు ఆరోపణలు రావడంతో, ఎన్‌టీఎఫ్ (నేషనల్ టెక్నికల్ ఫోరం) అధికారులు రంగంలోకి దిగారు. బయోమెట్రిక్ ధృవీకరణ ఆధారంగా అనర్హులను గుర్తించి తొలగించారు. కేంద్ర స్థాయి అధికారుల జోక్యంతో వివాదం సద్దుమణిగి, ఉత్తర ప్రదేశ్ జట్టును ఫైనల్‌కు అర్హంగా ప్రకటించారు. ఈ పరిణామాలతో కొద్దిసేపు గందరగోళం నెలకొన్నప్పటికీ, నిర్వాహకులు తక్షణ చర్యలు తీసుకోవడంతో పరిస్థితి సాధారణ స్థితికి వచ్చింది.



FOLLOW: @ANNTELUGU
12-1-2026
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు



# 69వ కేజీఎఫ్ అండర్-17 జాతీయ బాలుర కబడ్డీ పోటీల్లో రాజస్థాన్ ఘన విజయం

**పినపాక,మహా:** పాఠశాల క్రీడా సమాఖ్య (కేజీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన 69వ అండర్--17 జాతీయ బాలుర కబడ్డీ పోటీలు ఘనంగా ముగిశాయి. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిభావంతమైన కబడ్డీ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. చివరి రోజున జరిగిన ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగి ప్రేక్షకులను కట్టిపడేసింది.

ఫైనల్ పోటీలో రాజస్థాన్ జట్టు అద్భుతమైన ఆటతీరుతో ప్రత్యర్థులను మట్టికరిపించి విజేతగా నిలిచింది. తొలి రైడ్ నుంచే దూకుడుగా ఆడిన రాజస్థాన్ జట్టు, రైడర్లు మరియు డిఫెండర్ల సమన్వయంతో పాయింట్ల వర్షం కురిపించింది. ముఖ్యంగా చివరి నిమిషాల్లో చేసిన కీలక టాకిల్స్ మ్యాచ్‌ను తమవైపు తిప్పాయి. ఈ విజయం ద్వారా రాజస్థాన్ జట్టు జాతీయస్థాయిలో తమ ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించింది. రన్నర్అప్‌గా ఉత్తర ప్రదేశ్ జట్టు నిలిచింది. ఉత్తర ప్రదేశ్ ఆటగాళ్లు చివరి వరకు పోరాడి ఫైనల్‌లో మంచి ప్రతిఘటన చూపించారు. అయితే కొన్ని కీలక తప్పిదాలు, అదృష్టం కలసిరాకపోవడంతో విజయం చేజారింది. అయినప్పటికీ, టోర్నమెంట్ అంతటా చూపిన క్రమశిక్షణ, సమిష్టి ఆటతీరు క్రీడాభిమానుల ప్రశంసలు అందుకుంది. మూడో స్థానం కోసం జరిగిన పోటీలో హర్యానా మరియు తెలంగాణ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్ కూడా తీవ్ర ఉత్కంఠతో సాగింది. ఇరు జట్లు సమాన స్థాయిలో పోటీపడ్డప్పటికీ, చివరి నిమిషంలో హర్యానా జట్టు కోర్టు నుండి బైకాట్ చేసింది. దీనితో కోర్టులో నిలిచి ఉన్న తెలంగాణ జట్టు మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. తెలంగాణ ఆటగాళ్ల వేగవంతమైన రైడ్లు, గట్టి డిఫెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ విజయం రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది. పోటీల ముగింపు సందర్భంగా విజేతలు, రన్నర్అప్‌లు మరియు మూడో స్థానం సాధించిన జట్లకు ట్రోఫీలు, పతకాలు అందజేయనున్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ, ఈ తరహా జాతీయస్థాయి పోటీలు యువ క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాకుండా భవిష్యత్తు అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కబడ్డీపై పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని, రాబోయే రోజుల్లో మరిన్ని ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో విజేతలకు స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ బహుమతులు అందజేశారు.

